క్లుప్తంగా

బకాయి వేతనాలు చెల్లించాలి

గంపలగూడెం: మండలంలోని ఊటుకూరు గ్రామ పంచాయతీలో గత 3 సంవత్సరాలుగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలి వ్వకుండా ప్రస్తుత ప్రభుత్వం అకారణంగా విధుల నుంచి తొలగించిందని సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. 2021 నుంచి ఏడుగురు కార్మికులు పారిశుద్ధ్య పనులు, వాటర్ వర్క్స్ నిర్వహిస్తున్నామని, రెండు నెలల క్రితం ఎటువంటి సమాచారం లేకుండా తొలగించారన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ట్రిపుల్ ఐటీలో ఫ్రెషర్స్ డే

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఆదివారం రాత్రి స్టూడెంట్ మిత్ర ఆధ్వర్యంలో జూనియర్స్‌కు ఫ్రెషర్స్ డే వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఫ్యాకల్టీ కన్వీనర్ నాగార్జునదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, స్కిట్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ అధికారులు ఎ.బ్రహ్మస్వాములు, టి.దుర్గాభవాని, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర- 2047 పోటీలకు ఆహ్వానం

ముసునూరు: స్వర్ణాంధ్ర మండల స్థాయి పోటీలకు అన్ని యాజమాన్యాల హైస్కూళ్ల విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు చెప్పారు. ముసునూరు జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్వర్ణాంధ్ర- 2047 ప్రణాళిక తయారీ, యువ మేధావుల అభిప్రాయ సేకరణ అనే అంశంపై వ్యాస రచన, వక్తృత్వ, డిబేట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి గౌడ బజారుకు చెందిన పల్లగాని రాంబాబు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 40 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేశారు

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

తిరువూరు: శ్మశాన వాటిక లేక తమ వార్డులో అంత్యక్రియలు రోడ్డు వెంబడి చేయవలసి వస్తోందని, తక్షణం శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని తిరువూరు నగర పంచాయతీ 12వ వార్డు కౌన్సిలర్ గుమ్మా వెంకటేశ్వరి ఆర్డీఓ మాధవికి విజ్ఞప్తి చేశారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె వార్డు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై తాను పలుమార్లు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

అర్హులకు నష్టపరిహారం అందించండి

జూపూడి(ఇబ్రహీంపట్నం): అర్హులకు నష్టపరిహారం అందించాలని వరద బాధితులు అధికారులను కోరారు. మండల పరిధిలోని జూపూడి గ్రామ సచివాలయం వద్ద వరద బాధితుల గుర్తింపుపై సర్పంచి కాకి దేవమాత అధ్యక్షతన సోమవారం గ్రామసభ జరిగింది. వరద ముంపు బారిన పడిన ఇళ్ల లబ్ధిదారుల ఫైనల్ లిస్ట్ గ్రామ పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి ప్రకటించారు. ఆమె వెల్లడించిన వివరాలపై కొంతమంది గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముంపునకు గురైన అర్హుల వివరాలు లిస్ట్‌లో లేకపోవడంపై ప్రశ్నించారు. తక్షణం అర్హుల పేర్లు నమోదు చేయాలని పట్టుబట్టారు. లిస్ట్‌లో నమోదు కాని లబ్ధిదారుల వివరాలు అధికారులు మళ్లీ నమోదు చేశారు. గ్రామ కార్యదర్శి వైఎస్ భాగ్యలక్ష్మి, వీఆర్వో శ్రీకాంత్, వార్డు సభ్యుడు డి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కడ'గండ్లు'

నీరు చెట్టు పాపమే ఇది...
- మైలవరం నియోజకవర్గంలో 34 చెరువులకు గండ్లు
- గండ్ల మట్టి మేటలు వేసి తీవ్రంగా నష్టపోయిన రైతులు
- నియోజకవర్గంలో రూ.200 కోట్లకు పైగా నష్టం
- చెరువులలో నీరు లేకపోవడంతో రబీ సాగు ప్రశ్నార్థకమే


మైలవరం మండలం చంద్రాల ఊర చెరువుకు పడన గండి (ఫైల్)

జి.కొండూరు: నాడు నీరు–చెట్టు పాపమే నేడు రైతులకు శాపంగా మారింది. 2014–15 మధ్య కాలంలో నాటి ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఆ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు అందరూ ఏకమై ఇష్టారాజ్యంగా చెరువులను గుల్ల చేసి మట్టిని తరలించారు. ఆ పథకాన్ని ఆసరాగా చేసుకుని దాదాపు రూ.70 కోట్లు కొల్లగొట్టారు. చెరువుల అభివృద్ధి, కట్టల బలోపేతాన్ని గాలికొదిలేశారు. ఫలితంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మైలవరం నియోజకవర్గంలో చెరువులకు పెద్ద ఎత్తున గండ్లు పడ్డాయి. వరిపైరుపై మట్టి మేటలు వేసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చెరువులలో నీరులేక మరో పంట వేద్దామన్న ఆశ కూడా పోయింది. పెట్టిన పెట్టుబడి పోగా మేటలు తొలగించేందుకు రైతులపై అదనపు ఆర్థికభారం పడనుంది.

గండ్లు పడిన చెరువులు

జి.కొండూరు మండల పరిధిలో 38 చెరువులు ఉండగా 9 చెరువులకు గండ్లు పడ్డాయి. చిన్ననందిగామ పెద్దచెరువు, చిన్ననందిగామ మర్ల చెరువు, కుంటముక్కల తూర్పు చెరువు, కుంటముక్కల పడమర చెరువు, వెంకటాపురం చెరువు, వెల్లటూరు పడమర చెరువు, ఆత్కూరు కురువిడి చెరువు, ఆత్కూరు సావరాల చెరువు, చేగిరెడ్డిపాడు ఊర చెరువులకు గండ్లు పడ్డాయి. మైలవరం మండల పరిధిలో 24 చెరువులు ఉండగా 16 చెరువులకు గండ్లు పడ్డాయి. అవి వెల్వడం తూర్పుచెరువు, వెల్వడం మోదుగుల చెరువు, గణపవరం తూర్పు చెరువు, తోలుకోడు ఊర, మధ్య, చవిటి చెరువు, చంద్రాల మంత్రి చెరువు, కనిమెర్ల చెరువు, పొందుగుల ఎర్రచెరువు, పొందుగుల పంగిడి చెరువు, చంద్రగూడెం రిజర్వాయర్, చంద్రగూడెం మల్లయ్య కుంట చెరువు, బొర్రాగూడెం చెరువు, మొర్సుమల్లి చిన్న చెరువు, మొర్సుమల్లి పెద్ద చెరువు, మొర్సుమల్లి రిజర్వాయర్, మొర్సుమల్లి ములకలపెంట చెరువు, మైలవరం చిన్నచెరువులకు గండ్లు పడ్డాయి. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కొండపల్లి ఆకువాని చెరువు, ఈలప్రోలు గోవిందప్ప చెరువు, రెడ్డిగూడెం మండల పరిధిలో 69 చెరువులు ఉండగా 7 చెరువులకు గండ్లు పడినట్లు తెలిసింది.

రూ.200 కోట్ల వరకు నష్టం

ఇటీవల వచ్చిన వరదలకు మైలవరం నియోజకవర్గం తీవ్రంగా నష్టపోయింది. భారీ వర్షాలతో బుడమేరు, కృష్ణానదికి వచ్చిన వరదతో పాటు చెరువులకు కూడా గండ్లు పడడంతో నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ పరిధిలో 8మంది ప్రాణాలను కోల్పోయారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, ఇళ్లు, వరి, పత్తి, మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలు, పశుగ్రాసం ఈ వరదలలో కొట్టుకుపోయి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. చెరువులకు పడిన గండ్ల వల్లన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. గండ్లు పడిన మట్టి పంట భూముల్లో మేటలు వేసింది. ఈ విధంగా రహదారుల మరమ్మతులకు అధికారుల అంచనా ప్రకారం రూ.78.58 కోట్లు కావల్సి ఉంది.


వెల్లటూరు పడమర చెరువు కింద వరిపైరుపై మేటలు వేసిన మట్టి

పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల కొట్టుకుపోగా నియోజకవర్గ రైతులు రూ.2కోట్ల వరకు నష్టపోయారు. వరి పంటకు రూ.22.42 కోట్లు, పత్తి పంటకు రూ.13.15 కోట్లు, పెసర పంటకు రూ.54 లక్షలు, మినుము పంటకు రూ.1.93 కోట్లు, మొక్కజొన్నకు రూ.12 లక్షలు, వేరుశనగకు రూ.5లక్షల వరకు నష్టపోయారు. ఉద్యాన పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. పశుగ్రాసం, ఇళ్లు, ఇళ్లలో సామాన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫర్నిచర్ వీటన్నింటికి అదనంగా నష్టపోయారు. చెరువుల గండ్లు పూడ్చేందుకు అదనంగా ఖర్చు కానుంది.

రబీ సాగు ప్రశ్నార్థకమే

మైలవరం నియోజకవర్గంలో చెరువులకు గండ్లు పడడంతో ఇప్పటికే సాగులో ఉన్న పైరులన్నీ నీట మునిగి కుళ్లిపోయాయి. అయితే చెరువులలో నీరు ఈ గండ్ల ద్వారా పూర్తిగా బయటికి వెళ్లిపోవడంతో రబీ సాగు చేపట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. త్వరితగతిన చెరువు గండ్లు పూడ్చకపోతే మరలా వర్షం పడినప్పటికీ చెరువులలో నీరు నిండే అవకాశం కూడా లేదు. మైలవరం నియోజకవర్గంలో రెడ్డిగూడెంలో 13,600 హెక్టార్లు, జి.కొండూరు మండల పరిధిలో 12,800 హెక్టార్లు, మైలవరం మండల పరిధిలో 8,800 హెక్టార్లు, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 8వేల ఎకరాలు, విజయవాడ రూరల్ పరిధిలో 7వేల ఎకరాల వరకు సాగు భూమి ఉండగా ఇటీవల వచ్చిన వరదలకు 9,765 హెక్టార్లలో సాగు భూమి నీట మునిగి పాడైపోయింది. చెరువులలో నీరు లేకపోవడంతో పాటు రైతులు తీవ్ర నష్టాలలో ఉండడంతో రబీ సాగు చేపట్టే అవకాశం కూడా కనిపించడంలేదు.

రాష్ట్రాభివృద్ధే ధ్యేయం



నూజివీడు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని సుంకొల్లు, యనమదల, బత్తులవారిగూడెంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు మంత్రి వివరించారు. యనమదలలో రూ.15 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డు, సుంకొల్లులో రూ.7.50 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డు, బత్తులవారిగూడెంలో రూ.21 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీరు సమస్య లేకుండా చూస్తానని, అవసరమైన ప్రదేశాల్లో బోర్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో మూతపడిన పరిశ్రమలను పునఃప్రారంభించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

జి.కొండూరు: స్థానిక శాగం శివరామిరెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్లో మండల స్థాయి బాలికల అథ్లెటిక్ పోటీలను సోమవారం నిర్వహించారు. స్కూల్ గేమ్స్ పోటీలలో భాగంగా నిర్వహించిన బాలికల అండర్–14, 17 విభాగాలలో రన్నింగ్, జంపింగ్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావిలిన్ త్రో పోటీలకు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి 96 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. వీరిలో ఉత్తమ ప్రతిభ చాటిన 40 మందిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

స్వచ్ఛత మన జీవన విధానం కావాలి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: స్వచ్ఛత మన జీవన విధానం కావాలని, తద్వారా మన ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో స్వచ్ఛతా హీ సేవ 2024లో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం ప్రారంభించారు. శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, రోగులకు మందులు పంపిణీ చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి అయిన అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. దీనిలో భాగంగానే వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకుని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, స్వయంసహాయక సంఘాల సభ్యులు, యువతీ యువకులు, సీనియర్ సిటిజన్స్, పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థలు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నూతులపాటి బాల కోటేశ్వరరావు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.


రూ.4 లక్షల చెక్కును ఎమ్మెల్యే వసంతకు అందజేస్తున్న మైలవరం వివేకానంద హైస్కూలు యాజమాన్యం

వరద బాధితుల సహాయార్థం రూ.4లక్షల చెక్కు అందజేత

ఇటీవల సంభవించిన వరదలలో తీవ్రంగా నష్టపోయిన వరద బాధితుల సహాయార్థం మైలవరం వివేకానంద హైస్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు సేకరించిన రూ.4లక్షల చెక్కును స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు సోమవారం ఐతవరంలోని ఆయన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఎం.శ్రీనివాసరావు, పి.రాజారెడ్డి పాల్గొన్నారు.

వెలగలేరు గేట్లు ఎత్తకపోతే పెను ప్రమాదం జరిగేది

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

చంద్రాల(మైలవరం): ఇటీవల వచ్చిన వరద సమయంలో బుడమేరుపై వెలగలేరులో నిర్మించిన రెగ్యులేటర్ గేట్లు ఎత్తకపోతే దాదాపు నాలుగైదు గ్రామాల్లో వందల్లో మరణాలు సంభవించి ఉండేవని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద బుడమేరు పరిస్థితిని అధికారులతో పర్యవేక్షించినట్లు తెలిపారు. గేట్లు ఎత్తే సమయానికే గేట్లపై నుంచి 4, 5 అడుగుల వరకు వరద నీటి ప్రవాహం ఉందన్నారు. గేట్లు ఎత్తకపోతే రెగ్యులేటర్ మొత్తం కొట్టుకుపోయేదన్నారు. వరదల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున చేయూత ఇచ్చిందన్నారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు ఆవిష్కరించారు. ఇళ్లకు స్టిక్కర్‌లు అంటించారు. కార్యక్రమంలో జనసేన మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు(గాంధీ), బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నూతులపాటి బాలకోటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

గంపలగూడెం: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించి మంచిస్థాయికి చేరుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆటల పోటీలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొల్లెపోగు కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో కూర్చునేందుకు బెంచీలు, బల్లలు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గత ఏడాది నాబార్డు నిధులతో మంజూరైన బల్లలు, బెంచీలు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరాకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని, మధ్యస్తంగా నిలిచిన తరగతి గదులను పూర్తి చేసేందుకు కావల్సిన మెటీరియల్ సరఫరా కావల్సి ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసరావు షటిల్, వాలీబాల్ కోర్టులను ప్రారంభించారు. మొదటి రోజు అండర్–14, 17 విభాగాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికల ఆటల పోటీలను నిర్వహించి మండల స్థాయి జట్లను ఎంపిక చేశారు. తహసీల్దార్ రాజకుమారి, ఎంపీడీఓ చెంగయ్య, ఈవోపీఆర్డీ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, సర్పంచ్ కోట పుల్లమ్మ, హెచ్ఎం కిరణ్, ఆటల పోటీల కన్వీనర్ అంజయ్య, మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


గంపలగూడెం హైస్కూల్‌లో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

మైలవరం ఎల్బీఆర్సీఈ ప్రొఫెసర్‌కు అరుదైన గుర్తింపు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎల్బీఆర్సీఈ) ప్రొఫెసర్ వి.ధనరాజుకు ప్రపంచ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు సోమవారం తెలిపారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ 2024 సంవత్సరానికి గాను ప్రపంచ వ్యాప్తంగా లక్ష మంది ప్రొఫెసర్‌ల ప్రచురణలను పరిశీలించిన మీదట ర్యాంకులను కేటాయించిందని, అందులో తమ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.ధనరాజు టాప్ 2 ర్యాంకింగ్ జాబితాలో స్థానాన్ని కైవశం చేసుకున్నారన్నారు. మొత్తం 20 కేటగిరీల్లో పబ్లికేషన్స్ డేటాను విశ్లేషించి అంతర్జాతీయంగా ఉన్న ప్రొఫెసర్స్ రీసెర్చ్ వర్క్, పబ్లికేషన్స్, సైటేషన్స్ వంటి కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు కేటాయించిందన్నారు. ఎనర్జీ, బయోఫ్యూయల్స్, పొల్యూషన్ కంట్రోల్ విభాగాల్లో డాక్టర్ ధనరాజు అత్యుత్తమ పనితీరు కనబర్చారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ శ్రీకర్‌రెడ్డి డాక్టర్ ధనరాజును అభినందించారు.


మైలవరం ఎల్బీఆర్సీఈలో ప్రొఫెసర్ ధనరాజును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అప్పారావు తదితరులు

క్రీడలతో మానసికోల్లాసం

నరసాపురం(విస్సన్నపేట): క్రీడలు వలన శారీరక వ్యాయామంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ అన్నారు. నరసాపురం జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడా పోటీలను సోమవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ నాగమణి, పాఠశాల హెచ్ఎం ఎస్.శోభాలత, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రామకృష్ణ, వ్యాయామోపాధ్యాయుడు ఎం.రమేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజరు బదిలీ

తిరువూరు: తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజరు ఎ.వేణు ఇబ్రహీంపట్నం డిపోకు బదిలీ అయ్యారు. వేణు గత ఆగస్టులో స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా ఉత్తమ డిపో మేనేజరుగా జిల్లా కలెక్టరు నుంచి ప్రశంసాపత్రం పొందారు.

గంపలగూడెం మెయిన్ రోడ్డులో డ్రైనేజీ ఏర్పాటు చేయాలి

గంపలగూడెం: గంపలగూడెం మెయిన్ రోడ్డులో డ్రైనేజీ సౌకర్యం ఏర్పాటు చేసి మురుగునీరు, వర్షపు నీరు దిగువకు పారేలా చర్యలు తీసుకోవాలని గంపలగూడెం సర్పంచ్ కోట పుల్లమ్మ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును కోరారు. ఇది మంచిప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం గంపలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆమె అధ్యక్షతన నిర్వహించిన సభలో మాట్లాడుతూ గంపలగూడెంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు వివరించారు. పలు అంతర్గత రహదార్లలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. బస్టాప్ సెంటర్‌లో మరుగుదొడ్లు నిర్మాణం చేయాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి మాట్లాడుతూ తిరువూరు– మధిర అర్అండ్‌బీ ప్రధాన రహదారి గంపలగూడెం, తోటమూల గ్రామాల పరిధిలో ఆక్రమణలకు గురైందని, ఆ ఆక్రమణలను పూర్తిగా తొలగించాలన్నారు. పార్థసారథి హోటల్ సెంటర్ నుంచి తోటమూల వై-జంక్షన్ వరకు, అక్కడనుంచి గోసవీడు క్రాస్‌రోడ్డు వరకు ఆర్అండ్‌బీ రహదారిని ఆక్రమణలు తొలగించి, రహదారి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాప్ సెంటర్‌లో బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టాలన్నారు. గ్రామంలో శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని కోరారు. డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ సీహెచ్ రాజేశ్వరరావు, తహసీల్దార్ రాజకుమారి, ఎంపీడీఓ చెంగయ్య, ఈవోపీఆర్డీ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



గంపలగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

సంక్షిప్తంగా...

● లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, పట్టణ కార్యదర్శి జి.రాజు తదితరులు మాట్లాడారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్రం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కొండపల్లి ఐడీఏలో సోమవారం బ్లాక్ డే నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కేంద్రం కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు.

● బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



చాట్రాయి: మండలంలోని మర్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు అండర్–19 బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి కృష్ణాజిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలో హైస్కూలుకు చెందిన కె.పవిత్ర, పి.హర్షిత, పి.సుభాషిణి ఎంపికయ్యారు.

● వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం

ఆగిరిపల్లి: వరద బాధితుల సాయం కోసం ఆంధ్రప్రదేశ్ ఉపాధి శిక్షణ అధికారుల సంఘం ప్రెసిడెంట్ వీరభద్రారెడ్డి, సెక్రటరీ ఎన్వీ సురేంద్రబాబు ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి రూ.2 లక్షల చెక్కును అందజేశారు.

● ఎమ్మెల్యే నానాజీపై చర్యలు తీసుకోవాలి

ఆగిరిపల్లి: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో దళిత ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరావుపై దాడి చేసిన జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీపై చర్యలు తీసుకోవాలని ఆగిరిపల్లి మండల మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు బొబ్బర్ల సురేష్ డిమాండ్ చేశారు.

● పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం

తిరువూరు: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కమిషనర్ లోవరాజు, వైద్యాధికారి గార్గేయ, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● గణపవరం గ్రామ సీపీఎం కార్యదర్శిగా ఇస్సాక్

మైలవరం: మైలవరం మండలం గణపవరం గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ నాలుగవ మహాసభ సోమవారం జరిగింది. సందిపాము ఇస్సాక్‌ను గ్రామ శాఖ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు, సీపీఎం మండల నాయకులు ఆర్.రమేష్‌బాబు, సీహెచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● బీవీఆర్ కుటుంబ సభ్యులకు రఘువీరారెడ్డి పరామర్శ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొర్రా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పీసీసీ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి సోమవారం పరామర్శించారు. బొర్రా వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాసు, ధనేకుల మురళీమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

● మానసిక వ్యాధులపై అంగన్‌వాడీలకు శిక్షణ

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): వాసవ్య మహిళా మండలి సాంత్వన ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యం, సంబంధిత వ్యాధులపై అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లకు కిలేశపురంలో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. శిక్షణలో పాల్గొన్న కేతనకొండ సెక్టార్ అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలకు మానసిక వ్యాధులు, వాటికి కారణాలు, వ్యాధి వచ్చిన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సపై అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన వారు గ్రామాల్లో మానసిక వ్యాధులతో బాధపడుతున్న వారికి సాంత్వన కలిగించాలని సూచించారు. శిక్షణ సదస్సులో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కేశవ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జాహీదా, ఎంఎల్‌హెచ్‌పీ క్రాంతి, గోపీచంద్, ప్రియదర్శిని పాల్గొన్నారు.

● అనుమతులు లేకుండా మట్టి తోలకాలు



కొండపర్వ(విస్సన్నపేట): కొండపర్వ స్టేజీవద్ద ప్రైవేటు భూమిలోకి ఎటువంటి అనుమతులు లేకుండా రెండు రోజులుగా మట్టి తోలకాలు కొనసాగిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కన టిప్పర్లతో మట్టి తోలకాలు యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ కె.లక్ష్మీ కళ్యాణిని ప్రశ్నించగా కొండపర్వలో మట్టి తోలకాలు తమ దృష్టికి రాలేదని, వెంటనే వీఆర్వోను పంపించి మట్టితోలకాలు నిలుపుదల చేయిస్తామన్నారు.

● ఎంపీడీవో సేవలు అభినందనీయం

ఇబ్రహీంపట్నం: ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరదతో అనేక గ్రామాలు నీటిముంపునకు గురైన సమయంలో ఎంపీడీవో రామకృష్ణనాయక్ అందించిన సేవలు అభినందనీయమని పలువురు కూటమి నాయకులు కొనియాడారు. ఎంపీపీ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవోను శాలువా కప్పి సత్కరించారు. కూటమి నాయకులు పయ్యావుల రాము, మారాసు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

● పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

మైలవరం: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంతో పాటు మైలవరం పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచడానికి కళాశాల విద్యార్థులు తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.రంగారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.ఫణికుమార్, యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ మేజర్ మన్నే స్వామి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు, రెడ్‌క్రాస్ వలంటీర్‌లు పాల్గొన్నారు.

● కుక్కలు, కోతులను నియంత్రించాలని ప్రదర్శన

తిరువూరు: తిరువూరు పట్టణంలో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉన్నందున నగర పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సామాజిక కార్యకర్తలు సోమవారం ప్రదర్శన జరిపారు. వీధికుక్కలు, కోతుల దాడిలో మహిళలు, పిల్లలు తీవ్రంగా గాయపడుతున్నారని, వెంటనే వీటిని పట్టించి ఊరికి దూరంగా తరలించాలని విజ్ఞప్తి చేశారు. బైపాస్‌రోడ్డు వినాయకుని ఆలయం నుంచి నగర పంచాయతీ కార్యాలయం వరకు ప్రదర్శన జరిపిన అనంతరం కమిషనర్ లోవరాజుకు వినతిపత్రం సమర్పించారు. ప్రదర్శనలో పలు సామాజిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

గురుపూజా మహోత్సవం

ముసునూరు: ముసునూరు జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో సోమవారం నూజివీడు డీవైఈఓ సేవియా నాయక్ అధ్యక్షతన గురు పూజా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని పాఠశాలల్లో పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన గురువులు కె.కుటుంబరావు, కృష్ణవేణిలను సన్మానించారు. అనంతరం గత ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు నాగలక్ష్మి, వరప్రసాద్, రమేష్, సత్యనారాయణ, బాబూరావును సత్కరించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ రాజానాయన, ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు, హెచ్ఎంలు సునీల, ప్రవీణ పాల్గొన్నారు.